ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 10 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 22 ఏప్రిల్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# కలిసి నడుద్దాం.. నవ ప్రపంచాన్ని నిర్మిద్దాం
## జపాన్ వ్యాపారవేత్తలకు సీఎం రేవంత్ ఆహ్వానం



హైదరాబాద్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం): తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం రేవంత్ రెడ్డి జపాన్ వేదికగా ప్రపంచ దేశాలకు తెలియజేశారు. జపాన్ పర్యటనలో భాగంగా ఒసాకాలో జరిగిన వరల్డ్ ఎక్స్ పోలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం పాల్గొంది.
ఈ ఎక్స్ పోలో తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఒసాకాలో జరుగుతున్న వరల్డ్ ఎక్స్ పోలో దేశంలోనే మొదటి రాష్ట్రంగా తెలంగాణ పాలుపంచుకోవటం గర్వంగా ఉందని అన్నారు. జపాన్‌తో ఉన్న చారిత్రక స్నేహాన్ని దీర్ఘకాలిక భాగస్వామ్యంగా మార్చుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. తెలంగాణ-జపాన్ భాగస్వామ్యంతో భవిష్యత్తు ప్రణాళికలకు కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

**తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం**

తెలంగాణ రాష్ట్రంలో సులభతర పారిశ్రామిక విధానం, స్థిరమైన పాలన, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు ఉన్నాయని జపాన్ కంపెనీలకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. హైదరాబాద్ కేంద్రంగా ఉత్పత్తులు తయారు చేసి భారత మార్కెట్‌తో పాటు ఇతర దేశాలకు ఎగుమతులు చేయవచ్చని జపాన్ కంపెనీలకు సూచించారు. దీంతో తెలంగాణ-జపాన్ సంబంధాలు మరింత బలపడతాయని, ఒసాకా బేలో ఉదయించే సూర్యోదయంలా కొత్త అధ్యాయం తెలంగాణలో ప్రారంభమవుతోందని సీఎం అన్నారు. ఒసాకాతో పాటు ప్రపంచంతో కలిసి నవ ప్రపంచాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు.
తెలంగాణ ఇప్పటికే ఐటీ, బయోటెక్నాలజీ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణలో ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, టెక్స్టైల్స్ రంగాల్లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ సమీపంలో 30 వేల ఎకరాల్లో 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణంలో ఉందని, ఇది ఎకో, ఎనర్జీ, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీ ఆధారంగా రూపుదిద్దుకుంటోందన్నారు. ఈ సిటీలో మారుబెని కార్పొరేషన్‌తో కలిసి ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.
రాజధాని సమీపంలో ఓడరేవులతో అనుసంధానించేలా డ్రై పోర్ట్ ఏర్పాటు చేయనున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇది ఎగుమతులకు మార్గాన్ని వేగవంతం చేస్తుందని వెల్లడించారు. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా నది తీరాన్ని అర్బన్ గ్రీన్‌వేగా అభివృద్ధి చేసేందుకు టోక్యో, ఒసాకా నగరాల నుండి ఎంతో నేర్చుకోవాల్సి ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నైపుణ్య శిక్షణతో పాటు క్రమశిక్షణకు అద్దంపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. ఈ యూనివర్సిటీ రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచడంలో కీలకంగా నిలుస్తుందని ఆయన వివరించారు.



### ప్రజా సంక్షేమం లక్ష్యంగా
# నిర్ణయాలు
**ప్రజల జీవితాలు ప్రభావితం చేసేలా చర్యలు**
**సివిల్ సర్వీసెస్ డేలో ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం): తమ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు దేశ ప్రజల వెయ్యేళ్ల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తాము తసీఉ కుంటున్న నిర్ణయాలు దేశాభివృద్ధిని కాంక్షించి తీసుకుంటున్నాయేనని అన్నారు. సమగ్ర అభివృద్ధి అంటే దేశంలోని ఏ గ్రామం, కుటుంబం, ..మిగతా 2లో



### లక్ష మార్క్‌ను దాటిన
# తులం బంగారం
**చైనా,అమెరికాల మధ్య సుంకాల వార్**
**భారీగా పెరిగిన బంగారం ధరలు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం): బంగారం కొనుగోలు సామాన్యులకు మరింత కష్టతరంగా మారనుంది. మార్కెట్ వర్గాల అంచనాల మేరకు రోజురోజుకి బంగారం ధరలు అకాశాన్ని తాకుతున్నాయి. తాజాగా బంగారం ధరకి మరోసారి రెక్కలు వచ్చాయి. 10 గ్రాముల బంగారం ధర పన్నులతో కలిసి అక్షరాల లక్ష రూపాయిలను తాకింది. సోమవారం ఒక్కరోజే బంగారం రూ.2,350 పెరిగింది. దేశంలో పసిడి ధర ఈ స్థాయిని తాకడం ఇదే తొలిసారి. అమెరికా-చైనా సుంకాల యుద్ధం ..మిగతా 2లో

### పోప్ ఫ్రాన్సిస్
# కన్నుమూత
**ఇటీవలే ఆస్పత్రి నుంచి విడుదల**
**సంతాపం తెలిపిన ప్రపంనేతలు**
**ప్రధాని మోడీ, తెలుగు రాష్ట్రాల సీఎంల సంతాపం**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం): వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్ సోమవారం ఉదయం మృతి చెందారు. కేథలిక్‌ల అత్యున్నత మత గురువు పోప్ ఫ్రాన్సిస్ (88) ఇటలీ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7.35కు కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా శ్వాసకోశ సమస్యలు, డబుల్ న్యూమోనియా, కిడ్నీ సమస్యలతో తీవ్రంగా బాధపడ్డారు. ఫిబ్రవరి 14 నుంచి ఆయన 38 రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం గత నెల డిశ్చార్జి అయ్యారు. ఆయన మృతి విషయాన్ని వాటికన్ వర్గాలు ధ్రువీకరించాయి. 2013లో పోప్ బెనిడెక్ట్ ..మిగతా 2లో

# ప్రధాని మోదీతో వాన్స్ భేటీ



**వాణిజ్య ఒప్పందంపై చర్చ**
**వాన్స్ దంపతులు, అమెరికా అధికారులకు**
**ప్రధాని మోదీ ప్రత్యేక విందు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం): భారత పర్యటనకు వచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఢిల్లీ వేదికగా సోమవారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఇరునేతల మధ్య వాణిజ్యం, సుంకాలు, ప్రాంతీయ భద్రతతోపాటు పలు ద్వైపాక్షిక అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. అమెరికా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జేడీ వాన్స్ భారత్ పర్యటనకు రావడం ఇదే తొలిసారి. ఆయన వెంట భార్య ఉషా వాన్స్, ముగ్గురు పిల్లలతో పాటు ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధులు ఉన్నారు.
సోమవారం ఉదయం ఢిల్లీలో దిగిన జేడీ వాన్స్ దంపతులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఇతర అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాన్స్ పిల్లలు మీడియా దృష్టిని ఆకర్షించారు. కుమారులు ఇవాన్, వివేక్, కుమార్తె మీరాబెల్ భారతీయ సంప్రదాయ దుస్తుల్లో కన్పించారు. అనంతరం వారు ఢిల్లీలోని అక్షర్‌ధామ్ ఆలయాన్ని సందర్శించారు. భేటీ అనంతరం వాన్స్ దంపతులు, అమెరికా అధికారులకు ప్రధాని మోదీ ప్రత్యేక విందు ఇచ్చారు. ట్రంప్ టారిఫ్ దూకుడు వేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

**భారత్, అమెరికా సంబంధాల విస్తృతిపై!**

విందు అనంతరం సోమవారం ..మిగతా 2లో



### చిన్న పిల్లల అక్రమ రవాణాపై
# సుప్రీం ఆగ్రహం
**ఆచూకీ లేకుండా పోయిన**
**పిల్లలను కనిపెట్టండి**
**ఢిల్లీ పోలీసులకు సుప్రీం ఆదేశాలు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం): దేశ రాజధాని ఏరియాలో ఇటీవల అదృశ్యమైన ఆరుగురు పిల్లలను రక్షించాలని ఢిల్లీ పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా పిల్లల అక్రమ రవాణా పై సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. చిన్నారుల అక్రమ రవాణాకు పాల్పడేవారిని చట్టం ముందు నిలబెట్టాలని, అలాంటి ముఠాలు ఈ సమాజానికి ఎంతో ప్రమాదకరమని ..మిగతా 2లో

# పసుపు బోర్డు ఘనత మాదే

**బోర్డు పనులు**
**ఇంకా ప్రారంభించని కేంద్రం**
**కాళేశ్వరంతో రాష్ట్రం దివాళా**
**ప్రాణహిత చేవెళ్ల చేపట్టివుంటే**
**నిజామాబాద్‌కు నీరందేది**
**నిజామాబాద్ రైతు మహోత్సవ**
**సభలో మంత్రిఉత్తమ్**
**పామాయిల్ సాగుతో మంచి**
**లాభాలన్న మంత్రి తుమ్మల**

నిజామాబాద్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం): పసుపు బోర్డు తెచ్చిన ఘనత తమదేనని, దానికోసం తాను పోరాటం చేశానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బోర్డు ఏర్పాటు చేశారు కానీ ఇంకా పనులు ఎందుకు ప్రారంభించలేదని కేంద్రాన్ని ఆయన ప్రశ్నించారు. గత పదేళ్లలో ప్రాణహిత చేవెళ్లను పట్టించుకోలేదని విమర్శించారు. 22వ ప్యాకేజికి వెంటనే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిజామాబాద్‌లో రైతు సభలో మాట్లాడుతూ ..నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని సూచించారు. కాళేశ్వరంతో కొత్తగా ఆయకట్టు పెరగలేదని అన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టును ఆధునీకరిస్తామని స్పష్టం చేశారు. పూడికతీత పనులకు వచ్చే నెలలో టెండర్లు పిలుస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న ధాన్యం బోనస్ డబ్బులను త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి ఉంటే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ఎంతో ఉపయోగం ఉండేదన్నారు. గత ప్రభుత్వం సాగునీటిపై రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసినా.. అదనంగా ఒక్క ఎకరానికి నీరు ఇవ్వలేదని విమర్శించారు. నిజాంసాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టులను నిర్మించింది కాంగ్రెస్ హయాంలోనేనని చెప్పారు.





## జలమండలి పర్సనల్ డైరెక్టర్‌గా మహ్మద్ అబ్దుల్ ఖాదర్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం) జలమండలి పర్సనల్ డైరెక్టర్ గా మహ్మద్ అబ్దుల్ ఖాదర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సీజీఎం(పి అండ్ ఏ)గా పనిచేస్తున్న ఆయన డైరెక్టర్ (పర్సనల్)గా పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలోనే సోమవారం ఆయన ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డిని ఆయన ఛాంబర్ లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎండీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

**సన్మానించిన టీజీవో నేతలు:**

జలమండలి డైరెక్టర్ (పర్సనల్ %ఆ% అడ్మినిస్ట్రేషన్)గా పదోన్నతి పొందిన సందర్భంగా మహ్మద్ అబ్దుల్ ఖాదర్ ను టీజీఓ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా తరఫున అధ్యక్షులు ఎం.బి. కృష్ణ యాదవ్ ,అబ్దుల్ ఖాదర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కొత్త పదవిలో రాణించాలని, జలమండలికి సేవ చేయటంలో కృతకృత్యుడవ్వాలని, చేబట్టే ప్రతిపని విజయవంతమవ్వాలని శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సహాయ అధ్యక్షులు అశన్న, ట్రెజరర్ ఎం.వి. రమణ, జాయింట్ సెక్రటరీ శ్రీకాంత్, డాక్టర్ రమేష్, డాక్టర్ కోటాజీ, జాయింట్ సెక్రటరీ డాక్టర్ జె. రవికుమార్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ క్రాంతి విద్యా సాగర్, డాక్టర్ సునీతా జోషి , ఇతరులు పాల్గొన్నారు.




## హైదరాబాద్ నగరానికి మంచినీటి సౌకర్యం కల్పించింది కాంగ్రెస్ పార్టీ

**కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్**

కూకట్‌పల్లి, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం) 10 సంవత్సరాలు అధికార పార్టీ శాసన సభ్యుడిగా పని చేసిన మాధవరం కృష్ణారావు నిస్సిగ్గుగా నాలాలు, పూడికతీత అంటూ నియోజకవర్గంలో చేసిన రాజకీయాలు చెల్లుబాటు కాకపోవటంతో ఇప్పుడు కొత్తగా ఓటికుండ రాజకీయాలు మొదలుపెట్టారని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో హైదరాబాద్ నగరానికి నీళ్ళ కరువు వచ్చిందని మళ్లీ ఖాళీ బిందెలతో క్యూలో నిల్చోవలసి వస్తుందని మొసలి కన్నీరు కార్చడం మొదలు పెట్టడని విమర్శించారు. అసలు హైదరాబాద్ కు తాగునీటి సౌకర్యం కల్పించింది కాంగ్రెస్ పార్టీ అని మంజీరా నీరు, కృష్ణ నది నీటిని ఫేస్ 1, ఫేస్ టు, ఫేస్ త్రి ద్వారా, ప్రస్తుతం మనం తాగుతున్న గోదావరి నీళ్లు కాంగ్రెస్ హయాంలోనే పైప్ లైన్ ద్వారా ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి హైదరాబాద్ కు తరలించి నగర ప్రజల దాహార్తిని తీర్చింది అన్నారు. నగర ప్రజలను తగు నీటి కోసం ఇబ్బందులు పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడు చూడలేదని రమేష్ పేర్కొన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలకు తాగునీటిని అందించలేదంటూ ఎమ్మెల్యే కృష్ణారావు ఆరోపించడానికి కాంగ్రెస్ నాయకులు ఏ, బి బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పారెడ్డి ఖండిస్తూ సోమవారం బాలనగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు శవ రాజకీయాలు చేసిన తరహాలో నీటి విషయంలో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మోటార్లు సీజ్ చేస్తున్నారని అధికారులను తప్పు తప్పు పట్టడంపై వారు స్పందించారు. ఎవరికి వారే మోటార్లు పెట్టి నీరు లాగేసుకుంటే చివరి కాలనీలకు ప్రజలకు అపార్ట్మెంట్లో పైనున్న వారికి నీళ్లు ఎలా వస్తాయని అనుకుంటున్నారని వారు ప్రశ్నించారు. కొద్ది మ%శీ%దే నీరు మొత్తం లాగేసుకుంటే మిగిలిన వారి పరిస్థితి ఏంటని వారు ధ్వజమెత్తారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుకుంటుందని ఎవరిని ఇబ్బంది పెట్టాలని చూడదన్నారు. గత టిఆర్ఎస్ హయాంలో 10 ఏళ్లలో నియోజకవర్గంలో ఉన్న చెరువులన్నింటిని కృష్ణారావు, అతని అనుచరులు కబ్జాలు చేసి నీటి వనరులను ధ్వంసం చేశారని వారు విమర్శించారు. కృష్ణారావు అతని అనుచరులు కబ్జా చేసిన చెరువుల్లో సున్నం చెరువు, బోయిన చెరువు, మైసమ్మ చెరువు, నల్లచెరువులు ఉన్నాయన్నారు. చెరువులో నాళాలు చెరువు శిఖరం ప్రాంతాలు కబ్జా చేసి అమ్ముకుని సొమ్ము చేసుకున్న సంస్కృతి టీఆర్ఎస్ దే అని వారు విమర్శించారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో నీటి వనరులను లేకుండా చేసిన చరిత్ర కృష్ణారావుది ఇలా చెరువులు మాయం కావడంతోనే నువ్వు గర్భ జలాలు అడుగంటి ప్రస్తుత%శీ% నీటి కొరత ఏర్పడిందన్నారు. మరోవైపు అక్రమ కట్టడాల విషయంలోనూ కృష్ణారావు అడ్డుపడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అధికారులు చట్టాన్ని అమలు చేస్తారని అయితే అనుమతులు గురించి అక్రమ కట్టడాలు అతను ఎలా సమర్థిస్తాడని ప్రశ్నించారు. అసలు టిఆర్ఎస్ హయాంలోనే లెక్కకు మిక్కిలి అక్రమ కట్టడాలు పుట్టుకొచ్చాయని వాటికి తాగునీరు డ్రైనేజీ విద్యుత్ సరఫరా చేయడమే ఇప్పుడు తలకు మించిన భారంగా తమకు తయారైందన్నారు. అన్నారు చట్టాన్ని దాటి చేసే ఏ పని అయినా తాము సహించబోమని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఇప్పటికైనా కృష్ణారావు ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని వారు సూచించారు.

## లక్ష మార్క్‌ను దాటిన తులం బంగారం

మొదటి పేజీ తరువాయి...



వల్ల బంగారం ధరలు పెరిగిపోయాయి. దీంతో డాలర్ బలహీనపడి.. మదుపర్లు బంగారంపై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం సోమవారం 3,405 డాలర్లకు చేరింది. దీన్ని అనుసరించి సోమవారం సాయంత్రం 5.30 గంటలకు 24 క్యారెట్ల బంగారం రూ.1,00,016కు చేరింది. ఈ ఏడాదిలో బంగారం దాదాపు రూ.20వేలకు పైగా పెరగడం గమనార్హం. ఈ క్రమంలో బంగారం సరికొత్త రికార్డును నమోదు చేసింది. 10 గ్రాముల మేలిమి పసిడి ధర అక్షరాలా లక్ష రూపాయలకు చేరింది. దేశీయంగా లక్ష

రూపాయల మార్కును అందుకుంది. సాయంత్రం 5.30 గంటల సమయానికి 24 క్యారెట్ల పసిడి రూ.1,00,016కు చేరింది. ఆపై కాస్త దిగి వచ్చి రూ.99,900 వద్ద ట్రేడవుతోంది. శుక్రవారం ముగింపుతో పోలిస్తే దాదాపు రూ.2 వేలు పెరిగింది. ఈ ఏడాది ఇప్పటి వరకు బంగారం ధర దాదాపు రూ.20 వేలకు పైనే పెరగడం గమనార్హం. డిసెంబర్ 31న సుమారు రూ.79 వేలు ఉన్న పసిడి ధర.. గడిచిన మూడున్నర నెలల్లో 26 శాతం మేర పెరిగింది. అటు వెండి ధర సైతం కిలో మళ్లీ రూ.లక్షకు చేరువవుతోంది. గతంలో ఓసారి లక్ష మార్కును దాటిన వెండి.. ప్రస్తుతం రూ.99,299 పలుకుతోంది. అటు- మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలోనూ 10 గ్రాముల పసిడి తొలిసారి రూ.96 వేల మార్కు దాటింది. జూన్ నెల డెలివరీ కాంట్రాక్ట్స్‌లో 10 గ్రాముల పసిడి ఒక్క రోజులోనే రూ.1621 మేర పెరిగి ఇంట్రాడేలో రూ.96,875 వద్ద గరిష్ఠాన్ని తాకింది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా- చైనాల మధ్య వాణిజ్యం విషయంలో సయోధ్య కుదిరేంతవరకు ఇదే పరిస్థితి కొనసాగొచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

మొదటి పేజీ తరువాయి...

తర్వాత ఫ్రాన్సిస్ ఈ బాధ్యతలు చేపట్టారు. ఫ్రాన్సిస్ 1938లో అర్జెంటీనాలో జన్మించారు. దక్షిణ అమెరికా నుంచి ఈ పదవిని అందుకొన్న తొలి వ్యక్తి ఆయనే. తరచూ సామాజిక అంశాలపై కూడా పోపం వ్యాఖ్యలు చేస్తుంటారు. 2016లో రోమ్ బయట ఇతర మతానికి చెందిన శరణార్థుల పాదాలు కడిగారు. దీనిని ఆయన వినయం, సేవాతత్పరతకు చిహ్నంగా భావిస్తారు. పోప్ ఫ్రాన్సిస్ తన మరణానికి కొన్ని గంటల ముందు కూడా ఈస్టర్ పర్వదినాన భక్తులకు సందేశం ఇచ్చారు. వాటికన్ నగరంలోని పీటర్స్ స్క్వేర్‌లో దాదాపు 35,000 మందిని ఉద్దేశించి ఆయన ప్రపంచం కోసం సందేశం ఇచ్చారు. 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్, హ్యాపీ ఈస్టర్..!' అని పోప్ స్వయంగా చెప్పారు. అనంతరం ఆయన సందేశాన్ని ఆర్చి బిషప్ డియాగో రావెలి చదివి వినిపించారు. సంక్షోభాలతో రగులుతున్న గాజా, ఉక్రెయిన్, కాంగో, మయన్మార్‌లలో శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన భార్య ఉషతో కలిసి ఈస్టర్ సందర్భంగా పోప్‌ను కలిశారు. ఈ సందర్భంగా పోప్ మూడు పెద్ద చాకొలెట్ ఈస్టర్ ఎగ్స్‌ను వాన్స్ దంపతులకు బహూకరించారు. ఆయన అనారోగ్యం పాలైన తర్వాత అంతమంది జనాల్లోకి రావడం ఇదే తొలిసారి. ప్రత్యేక వాహనంలో ప్రజల మధ్య నుంచి ఆయన ప్రయాణించడం విశేషం. మధ్యలో ఆగి పసికందులను, చిన్నారులను ఆశీర్వదించారు. ఆదివారం జరిగిన ఈస్టర్ వేడుకల్లో సైతం ఆయన పాల్గొన్నారు. ఈ మేరకు వాటికన్ సిటీ- వర్గాలు వెల్లడించాయి. పోప్ ఫ్రాన్సిస్ తన 12 ఏళ్ల వయస్సు నుంచే చర్చి, సమాజం, అట్టడుగు వర్గాల కోసం అంకితభావంతో పని చేశారు. 1936,డిసెంబర్ 17వ తేదీన అర్జెంటీనాలో పోప్ ఫ్రాన్సిస్ జన్మించారు. 2013 మార్చి 13న 266వ పోప్‌గా ఫ్రాన్సిస్ ఎంపికయ్యారు. ఆయన మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోప్ ఫ్రాన్సిస్ మృతికి ఆయన సంతాపాన్ని తెలిపారు. ఆయన మరణం తనను తీవ్రంగా కలత పెట్టిందన్నారు. భారత ప్రజలపై పోప్ ఫ్రాన్సిస్ ప్రేమాభిమానాలు నిత్యం నిలిచి ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. కాథలిక్ సమాజానికి ఈ సందర్భంగా ఆయన తన సంతాపాన్ని తెలిపారు. అలాగే చిన్ననాటి నుంచి క్రీస్తు ఆదర్శాలను పోప్ ఫ్రాన్సిస్.. తనను తాను అంకితం చేసుకున్నారని వివరించారు. పేదలు, అణగారిన ప్రజలకు ఆయన సేవలందించారని గుర్తు చేశారు. దేవుని ఆలింగనంలో ఆయన ఆత్మకు శాశ్వత శాంతి లభిస్తుందని ఈ సందర్భంగా ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా 1.4 బిలియన్ల మంది కాథలిక్కులు.. పోప్ ఫ్రాన్సిస్‌ను ఆరాధిస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది ఇటలీలో జీ7 శిఖరాగ్ర సమావేశం జరిగింది. ఈ సమావేశం వేదికగా పోప్‌ను ప్రధాని మోదీ కలిసి సంగతి తెలిసిందే. అలాగే పోప్ ఫ్రాన్సిస్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు.

పోప్ మరణ వార్త ఇప్పుడే తెలిసింది. నేను ఆయన్ను నిన్నే కలిశాను. కొవిడ్ తొలినాళ్లలో ఆయన ప్రసంగాలను నేను మర్చిపోలేను. అవి చాలా అద్భుతమైనవని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు. పోప్ ఫ్రాన్సిస్ మరణానికి ప్రపంచం సంతాపం తెలియజేస్తోంది. విధివంచితుల విషయంలో ఆయన ప్రేమ, మానవత్వం కేథలిక్ ప్రపంచానికి వెలుపల కూడా కొన్ని లక్షల మందిని ప్రభావితం చేసిందని ఐరోపా సమాఖ్య అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ అన్నారు. పోప్ ఫ్రాన్సిస్ మరణం ప్రపంచానికి తీరని లోటు-. ఆయన కరుణ, ప్రేమకు ప్రతిరూపం. సత్యం కోసం ఎప్పుడూ నిలబడ్డారు. అన్యాయాలపై నిర్భయంగా మాట్లాడారు. పేదలు, అణగారిన వర్గాలపై చాలా శ్రద్ధ చూపించారు. మరింత శాంతియుత, దయామయ ప్రపంచాన్ని కోరుకొనే లక్షల మందికి ఆయనో స్ఫూర్తిదాత అని ప్రియాంకా గాంధీ వాద్రా అన్నారు. పోప్ ఫ్రాన్సిస్ మృతి మానవాళికి తీరని లోటు-. ఆయన మహోన్నత ఆధ్యాత్మిక వ్యక్తి. తన జీవితాన్ని చర్చి, మానవాళి సేవకు అంకితం చేశారు. సామాజిక న్యాయం కోసం అవిశ్రాంత కృషి చేశారు. ప్రపంచ శాంతి స్థాపకుడిగా పోప్ ఫ్రాన్సిస్ పాత్ర అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ మృతి నన్ను ఎంతో బాధించింది. ఆధ్యాత్మిక నాయకుడిగా కోట్ల మందిలో స్ఫూర్తి నింపారు. శాంతి సందేశంగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున ప్రపంచ క్యాథలిక్ కమ్యూనిటీకి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## స్వచ్ఛంద సంస్థలు విద్యార్థుల యోగక్షేమాలు చూసుకోవడం శుభ పరిణామం: ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు

**కేజీబీవీ పాఠశాలలో రోటరీ క్లబ్ 1000 ఎంతో విద్యార్థులకు 100 బంక్ బెడ్స్ పంపిణీ**

వరంగల్, ఏప్రిల్ 21 ( ప్రభాత ఉదయం బ్యూరో): వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో రోటరీ క్లబ్ వరంగల్ వారి సౌజన్యంతో విద్యార్థులకు 100 బంక్ బెడ్స్ పంపిణీ చేసే కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే నాగరాజు ను పాఠశాల విద్యార్థినీలు ఘన స్వాగతం పలికారు.అనంతరం రోటరీ క్లబ్ గవర్నర్, రోటరీ సభ్యులు ఎమ్మెల్యే నాగరాజు కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ... తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏర్పడ నాటి నుంచి విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా వసతి గృహాలలో విద్యార్థులకు సౌకర్యాలను మెరుగు చేస్తున్నప్పటికీ, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి విద్యార్థుల యోగక్షేమాలను చూసుకోవడం గొప్ప శుభపరిమానమని అన్నారు. రోటరీ క్లబ్ సహకారం విద్యార్థులు విద్యను అభ్యసించడంతోపాటు ఈ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యార్థులకు సన్న బియ్యం భోజనం తో పాటు, వారాంతపు మెనూ తో కూడిన పౌష్టికాహారాన్ని అందిస్తూ, విద్యార్థినిలకు డైట్ చార్జీలు పెంచి వారిని అన్ని విధాలుగా చూసుకుంటూ విద్యార్థులలో ఉన్న స్కిల్స్ పెంపొందించడం కోసం ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ప్రధమంగా సీఎం రేవంత్ రెడ్డి ముందు చూపుతో యంగ్ ఇండియా స్కూల్ స్థాపించి గ్రామీణ పట్టణ విద్యార్థులలో ఉన్న స్కిల్ డెవలప్మెంట్ ను వెలికి తీసేందుకు ఈ పాఠశాలను స్థాపించి ప్రభుత్వ పోలీస్ డిపార్ట్మెంట్ పిల్లలకు 50 శాతం రిజర్వేషన్ సాధారణ పౌరుల పిల్లలకు 50 శాతం రిజర్వేషన్ తో కూడిన యంగ్ ఇండియా స్కూల్ ను ఈ సంవత్సరం స్థాపించారు .అదేవిధంగా ప్రతి ఒక్క నియోజకవర్గంలో



ఇంటిగ్రేటెడ్ స్కూల్ లను ఏర్పాటు చేయడం కోసం మన నియోజకవర్గంలో ఉప్పరపల్లి క్రాస్ రోడ్ నందు 200 కోట్లతో 20 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రతిపాదనలు కోరిందని, పిల్లలు కష్టపడి చదువుకొని భవిష్యత్తులో రాణించాలని చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలని విద్యార్థులను ఉద్దేశించి తెలియజేశారు. విద్యార్థినీలు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థినీలను సెలవులలో ఇంటికి వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండి సోషల్ మీడియా మాధ్యమాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే నాగరాజు కోరారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు బాలకోటి రెడ్డి, రాజా గోపాల్ రావు, రోటరీ క్లబ్ సభ్యులు, ఎంఈఓ లింగారెడ్డి, ఎమ్మార్వో వెంకటస్వామి, పాఠశాల ప్రిన్సిపల్ నజియా సుల్తానా, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, మండల గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంతో రైతులకు న్యాయం

**ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు**



వరంగల్ ,ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం బ్యూరో): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం రైతులకు న్యాయం జరిగే విధంగా ఉంటుందని, రైతుల కళ్లలో ఆనందం చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో పాలకుర్తి మండల కేంద్రంలో రైతు వేదిక ప్రాంగణంలో జనగాం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి వెన్నముక రైతు అని, రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. బీ ఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణి పోర్టల్ తీసుకువచ్చి గులాబీ నాయకులకు ఇష్టరీతిన వారి పేర్లపై వందలాది ఎకరాలు పట్టాలు చేయించుకుని చట్టాన్ని చుట్టముగా మలుచుకొని రైతు బంధు పొందారే తప్ప సామాన్య రైతుకు న్యాయం జరిగిన దాఖలా లేదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడగానే ధరణి పోర్టల్ ను బంగాళాఖాతంలో కలిపి సామాన్య రైతుకు శాశ్వత పరిష్కారం అయ్యే విధంగా భూభారతి చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చిన మేరకు భూభారతి చట్టాన్ని ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అమలు చేశారని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో రైతుల అన్ని భూ సమస్యలు తీరుతాయని అన్నారు. గత పాలకులు చేసిన ధరణి చట్టంతో రైతులు మోసపోయారని దుయ్యబట్టారు. భూ భారతి చట్టం ద్వారా భూముల రికార్డులు పారదర్శకంగా నిర్వహించి, భవిష్యత్ తరాలకు భూ హక్కుల విషయంలో స్పష్టత కల్పించడమే మన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. భూ కబ్జాలు, అక్రమాలు, వివాదాలు తొలగించి రైతులకు భద్రత కల్పించేందుకు ఈ చట్టం కీలకంగా పనిచేస్తుందని చెప్పారు. రైతులు తమ భూములకు సంబంధించి పూర్తి సమాచారం అందించడంతో పాటు, అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూ రికార్డులను నూతనంగా నమోదు చేస్తారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి మానస పుత్రికగా భూ భారతి నిలుస్తుందన్నారు. రైతులు ఎలాంటి అనుమానాలు లేకుండా భూమి వివరాలను అధికారులు చేపడుతున్న సర్వేల్లో సరిగ్గా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ చట్టం అమలుతో భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలకు స్థానం ఉండదన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం రైతుల భవిష్యత్తు కోసమేనని అన్నారు.ఈ సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో హాజరై, వారి సందేహాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు గ్రామస్థాయిలో సర్వేలు ఎలా జరుగుతాయో, భూ నక్షా పునర్నిర్మాణ ప్రక్రియ ఎలా ఉంటుందో వివరించారు.ఈ అవగాహన సదస్సులో జనగాం జిల్లా అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్, స్టేషన్ఘన్పూర్ ఆర్డీవో వెంకన్న, పాలకుర్తి తహసీల్దార్ నాగేశ్వర చారి, ఎంపీడీవో రాములు, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమార్ స్వామి గౌడ్, మాజీ ఎంపీపీ కారు పోతుల శ్రీనివాస్ గౌడ్,మాజీ సర్పంచ్ లు కిషన్ నాయక్,వీరమనేని యాకాంతరావు, భూమ రంగయ్య, ఎండి సలీం, పాలకుర్తి ఆర్ఐ రాకేష్, వివిధ శాఖల అధికారులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న పిల్లల అక్రమ రవాణాపై సుప్రీం ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి...

హెచ్చరించింది. నవజాత శిశువులను లక్షల రూపాయలకు అమ్ముతున్నట్లు- వచ్చిన వార్తలపై జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ ఆర్ మాధవన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టింది. 'ఆ ఆరుగురు చిన్నారుల ఆచూకీని గుర్తించండి. పిల్లలను అమ్ముతున్న, కొంటున్న వారిని చట్టం ముందు నిలబెట్టండి. వారందరూ నిందితులే. వారంతా సమాజానికి పెద్ద ముప్పుగా పరిణమించారు' అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిల్లల అక్రమంగా రవాణా చేసేవాళ్లు హంతకులకంటే ప్రమాదకరమని జస్టిస్ పార్థివాలా అన్నారు. 'ఎవరైనా ఒక వ్యక్తిని హత్య చేస్తే దాని వెనుక పలు కారణాలు, ఉద్దేశాలు ఉంటాయి. ఆ తర్వాత అతడు మరో హత్య చేయకపోవచ్చు. కానీ పిల్లలను కిడ్నాప్ చేసి అమ్మేవారు ఆ నేరాలకు మళ్లీమళ్లీ పాల్పడుతున్నారు. వారు ఈ సమాజానికి హంతకుల కంటే ప్రమాదకరమైనవారు' అని సుప్రీంకోర్టు ఆందోళన వెలిబుచ్చింది. ఢిల్లీలో పిల్లల అక్రమ రవాణా రాకెట్ వెనుకున్న కీలక సూత్రధారిని వెంటనే పట్టు-కోవాలని పోలీసులను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో చిన్నారులను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విక్రయిస్తున్నారని, దీని వెనుక ఒక పెద్ద ముఠా పనిచేస్తున్నట్లు- వార్తలు వస్తున్నాయని పేర్కొంది. ఈ సందర్భంగా పోలీసులు.. కొందరు పిల్లలను ఎవరూ కిడ్నాప్ చేయడం లేదని, తల్లిదండ్రులే విక్రయిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దాంతో పిల్లలు దొరికినా ఎవరైనా తల్లిదండ్రులు వారిని తిరిగి తీసుకోవడానికి తల్లిదండ్రులు సిద్ధంగా లేకపోతే.. ప్రభుత్వమే వారి బాధ్యత తీసుకోవాలని కోర్టు సూచించింది. ప్రతి ఏడాది దాదాపుగా రెండు వేల మంది పిల్లల అక్రమ రవాణా కేసులు వెలుగులోకి వస్తున్నాయని జాతీయ -కై-మ్ రికార్డ్స్ బ్యూరో నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

## ప్రజాసంక్షేమం లక్ష్యంగా నిర్ణయాలు

మొదటి పేజీ తరువాయి...

ఒక్క పౌరుడు కూడా వెనకబడి ఉండకూడదని అర్థం. ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల వెయ్యేళ్ల భవిష్యత్తుపై సానుకూల ప్రభావం చూపుతాయనడంలో సందేహం లేదన్నారు. టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదని వ్యాఖ్యానించారు. రాబోయే అవకాశాలను కూడా అంచనా వేయగలగాలని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ యువత, రైతులు, మహిళల ఆకాంక్షలు నెరవేర్చుతూ ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఉపయోగపడతాయి. వారి అసాధారణ ఆకాంక్షలు నెరవేర్చ డానికి సాధారణంగా కృషి చేస్తే సరిపోదు. అంతే వేగంతో ప్రభుత్వం పని చేయాల్సి ఉంటుందని ప్రధాని పేర్కొన్నారు. టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదు. కొత్త అవకాశాలు సృష్టించడం. పథకాలు ప్రజలపై ఎంత ప్రభావం చూపుతాయనేది కీలకం. దాని ఆధారంగా నాణ్యమైన పాలన కొనసాగించడం సాధ్యమవుతుంది. ఈ పదేళ్లలో భారత్‌లో ఎన్నో మార్పులు జరిగాయి. పాలన పారదర్శకత, ఆవిష్కరణ ఇలా ఎన్నో రంగాల్లో కొత్త మార్క్‌ను నెలకొల్పుతోందని అన్నారు. 2023లో లో జీ20 భారత్ అతిథ్యమిచ్చిన సంగతి తెలిసిందే. నాడు 'జనభాగిదారి' విధానం ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చింది. యావత్ ప్రపంచ దృష్టి మన దేశంపై పడింది. కార్యక్రమాల్లో పాల్గొనడం మాత్రమే కాదు.. పలు కార్యక్రమాలను నడిపించే స్థాయికి మన దేశం చేరింది. అగ్రగామిగా నిలుస్తోంది. ఈసందర్భంగా సివిల్ సర్వెంట్లకు ఓ విజ్ఞప్తి చేయాలనుకుంటున్నా. పేదల సమస్యలను ఓపిగ్గా వినండి. వారితో సున్నితంగా వ్యవహరించండి. వారిని గౌరవించండి. పేదల సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

## ప్రధాని మోదీతో వాన్స్ భేటీ

మొదటి పేజీ తరువాయి...

రాత్రే వాన్స్ దంపతులు జయపురకు వెళ్తారు. అక్కడ విలాసవంతమైన రాంభాగ్ ప్యాలెస్ హోటల్‌లో బస చేస్తారు. మంగళవారం ఉదయం పలు చారిత్రక ప్రదేశాలను సందర్శిస్తారు. అందులో అంబర్ కోట కూడా ఉంది. మధ్యాహ్నం రాజస్థాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో వాన్స్ ప్రసంగిస్తారు. ట్రంప్ హయాంలో భారత్, అమెరికా సంబంధాల విస్తృతిపై మాట్లాడతారు.

## పట్టపగలు ఇంట్లోకి ప్రవేశించి కత్తులతో బెదిరించి

# బంగారం, వెండి, నగదు దోచుకెళ్లిన దొంగలు

బుద్వేల్, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం) : పట్ట పగలు ఇంట్లోకి ప్రవేశించి కత్తులతో బెదిరించి ఆరు తులాల బంగారం, 20 తులాల వెండి, రూ. 20వేల నగదు ను దోచుకెళ్లిన సంఘటన ఇది. ఈ సంఘటన సోమవారం ఉదయం 9 :20 నిమిషాలకు సన్ సిటీ, పీ అండ్ టీ కాలనీలో చోటు చేసుకుంది. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... బండ్లగూడ సన్సిటీ, పీ అండ్ టీ కాలనీలో సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పనిచేసే మహ్మద్ షాకీర్ కుటుంబం నివాసం ఉంటుంది. ఆ ఇంట్లో క్రింద పోర్షన్ లో షాకీర్ కుటుంబం ఉంటుండగా పైన పోర్టన్ లో వారి సోదరులు నివాసం ఉంటారు. ఉదయం 9:20 నిమిషాలకు తెల్లని షిఫ్ట్ డీజైర్ కారులో ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. డ్రైవర్ సీటులో ఉన్న వ్యక్తి కారులోనే ఉన్నాడు. మిగతా నలుగురు షాకీర్ ఇంటి తలుపులు బయట నుంచి కొట్టడంతో తెలిసిన వారే అనుకుని షాకీర్ భార్య తలుపులు తెరిచింది. ఇంతలోనే ఇంట్లోకి ప్రవేశించిన నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ను బెదిరించి బంగారు నగలు, డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఆ సమయంలో షాకీర్ పడుకుని ఉన్నాడు. పలుగురిలో ఒకరి వద పదునైన కత్తి ఉంది. ఆ కత్తితో షాకీర్ భార్యను బెదిరించి నగలు, నగదు ఇవ్వకుంటే చంపుతానని బెదిరించారు. దీంతో భయపడిపోయిన ఆమె బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.20వేలు తీసి ఇచ్చింది. వాటిని తీసుకున్న దొంగలు అక్కడి నుంచి తాము వచ్చిన తెల్లని స్విఫ్ట్ డిజైర్ కారులో వెళ్లిపోయారు.



దోపిడి జరిగిన ఇళ్లు..





వివరాలు సేకరిస్తున్న ఏసీపీ తుల శ్రీనివాస్.. ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో



దోపిడి సమయంలో ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కారు..





సీసీ కెమెరాలలో నిందితుల చిత్రాలు

**దొంగలు వెళ్లిపోయాక బయటకు వచ్చి అరవడంతో..**

దొంగలు బంగారం, వెండి, నగదు దోచుకొని పారిపోయిన తర్వాత షాకీర్ భార్య భర్తకు, పైన నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలుపడంతో వారు భయటకు వచ్చి దొం గలు దొంగలు అని అరిచారు. దీంతో ఇరుగు పొరుగు వారు బయటకు వచ్చారు. అప్పటికే దొం గలు పారిపోయారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో లు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. వేలి ముద్రల నిపుణులను పిలిపించి వేలిముద్రలు సేకరించారు.

**ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు : ఏసీపీ తుల శ్రీనివాస్**

దోపిడి గురించి రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ మాట్లాడుతు, దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పక్కింట్లో ఉండే సీసీ కెమెరాలలో దొంగలు వచ్చిన కారు విజువల్స్ వచ్చాయని తెలిపారు. వాటి ఆధారంగా గాలింపు చేపట్టినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

## దేశానికి సేవలు, పేదలకు మేలు చేసింది కాంగ్రెస్ ఆధ్వర్యంలోనే..

**రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వాలి**
**-జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్**

బుద్వేల్, ఏప్రిల్21(ప్రభాత ఉదయం) : స్వాతంత్ర్య పోరాటంతో పాటు స్వాతంత్ర్యం వచ్చాక భారత దేశాన్ని అభివృద్ధి చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మకమైన జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమాన్ని సోమవారం లక్ష్మీగూడ వాంబే కాలనీ, రాజీవ్ గృహకల్ప, బృందావన్ కాలనీలలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నత్తి ధనుంజయ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజ్యాంగ పీఠిక లతో కూడిన కరపత్రాలను ప్రజలను పంచి పెట్టారు. రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అంటు ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, మాట్లాడుతూ, దేశంలో విశ్వవిద్యాలయాలు, ఐఐటీ కళాశాలలు, పెద్ద పెద్ద ఆసుపత్రులు కట్టిన ఘనత కాంగ్రెస్ కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో పేదలకు అనేక పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేయడం జరిగిందన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో అధికారం లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత రవాణ సౌకర్యం ప్రవేశపెట్టిందని, తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న పేదలకు ఉచితంగా సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తుందన్నారు. ఉచిత విద్యుత్ సౌకర్యం తో పాటు రైతు బందు, రైతు రుణమాఫీ, పేదలకు రూ. 500లకే వంట గ్యాస్ సరఫరా, పేదలైన వారికి ఉచిత విద్యుత్, ఉచిత నీటి సరఫరా లాంటి అనేక పథకాలను అమలు చేస్తుం దని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానపరుస్తు, రాజ్యాంగాన్ని రాసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను అవమానప రుస్తున్నారని వాపోయారు. వ్యవస్థలన్నింటిని తమ చేతుల్లో పెట్టుకుని వాటికి విలువ లేకుండ చేస్తున్నారన్నారు. బీజేపీ కుల, మత విభేదాలు సృష్టించి దేశంలో మతం పేరుతో రాజకీయాలు చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుదాకర్, మధుకర్, సరికొండ వెంకటేశ్, జీవన్ గౌడ్, బొల్ల వెంకటేశ్. దత్తు. ఎస్. జైపాల్, గోపి, శ్రీనివాస్ చారి, శరణమ్మ, లావణ్య తో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్ద షాపూర్ మల్లన్న దేవాలయం నిర్మాణానికి సహకరించండి

**తాసిల్దార్ రవీందర్ దత్‌కు విన్నవించుకున్న యాదవ సంఘం సభ్యులు**

శంషాబాద్, ఏప్రిల్ 21( ప్రభాత ఉదయం) శంషాబాద్ మండలంలోని పెద్ద షాపూర్ వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మల్లన్న దేవాలయ నిర్మాణానికి కొందరు ఆటంకం కల్పిస్తున్నారని వారిపై తగిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యాదవ సంఘం సభ్యులు శంషాబాద్ తహసిల్దార్ ను కోరారు. యాదవ సంఘం అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో అసెంషాబాద్ తహసిల్దార్ రవీందర్ దత్ ను సోమవారం కలసి వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు అందరూ కలిసికట్టుగా ఉంటూ దేవాలయాన్ని నిర్మిస్తున్నారని కాగా గ్రామానికి చెందిన ఒకరిద్దరు వ్యక్తులు తరచుగా పనులను ఆటంకం కలిగిస్తూ ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. దేవాలయ నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వారిపై శంషాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని గ్రామస్తులు వివరించారు. తహసిల్దార్ జోక్యం చేసుకొని దేవాలయ నిర్మాణంలో ఆటంకాలు ఎదుర్కొకుండా సహకారం అందించాలని వారు కోరారు. అందరికీ ఉపయోగపడే విధంగా మానసిక ప్రశాంతత పొందే విధంగా దేవాలయ నిర్మాణాన్ని రూపకల్పన చేయడం జరుగుతుందని దీనివలన గ్రామస్తులు అందరికీ ఎంతో మేలు జరుగుతుందని వారు వివరించారు.




తహసిల్దార్ దత్తుకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు



మాజీ మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి

## నేడు ఇంద్రన్న వర్ధంతి

బుద్వేల్, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం) : ప్రజల మనిషి, రంగారెడ్డి జిల్లాలో మకుటం లేని మహారాజుగా వెలుగొందిన మాజీ మంత్రి స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 22న డైరీ ఫామ్ చౌరస్తాలో నిర్వహించినట్లు ఆయన అభిమానులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళవారం ఉదయం 9 గంటలకు, యువ నాయకుడు, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి , ఇంద్రన్న తనయుడు పి కార్తీక్ రెడ్డి డైరీ ఫామ్ (రాజేంద్ర నగర్) లో జరిగే వర్ధంతి కార్యక్రమం లో పాల్గొంటారు, కార్యకర్తలు , అభిమానులు పెద్ద ఎత్తున హాజరు అయి విజయవంతం చేయాలని కోరారు. కౌకుంట్ల లో (చేవెళ్ల) సైతం వర్ధంతి కార్యక్రమం ఉంటుందన్నారు.



రాజేంద్రనగర్ గ్రంథాలయంలో కోరని సదానంద్, తదితరులు

## గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలి: కోరని సదానంద్

బుద్వేల్, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ లో గల గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరని సదానంద్ అన్నారు. సోమవారం ఆయన అంబేద్కర్ నగర్ లో ఉన్న గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని పుస్తకాలు ఉన్నాయని, వాటిని నిరుద్యోగులైన యువత ఉపయోగించుకోవాలన్నారు. సివిల్స్, టీఎస్పీఎస్సీ, టెట్ లాంటి పోటీ పరీక్షలకు హాజరయ్యే యువత కు రాజేంద్రనగర్ గ్రంథాలయం ఎంతో ఉపయోగకరంగా ఉంటు ందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎస్ఐ దాసరి రమేశ్, వ్యవసాయ వర్శిటీ విశ్రాంత ఉద్యోగి వేము వందనం. బీజేపీ దళితమోర్చా రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కోరని క్రాంతి, పీఎస్ రావు, పచ్చ శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## ఓ వ్యక్తిని కొట్టి సెల్ ఫోన్‌ను లాక్కున్న మైనర్లు

బుద్వేల్ , ఏప్రిల్21(ప్రభాత ఉదయం): హైదర్ గూడ పోస్టాఫీసు వద్ద నుంచి నడుచుకుం టు వెళ్తున్నా గుడి మల్కాపూర్ కు చెందిన సురేశ్(35) అనే వ్యక్తిని కర్రలతో కొట్టి అతని సెల్ ఫోన్ ను లాక్కున్క వారిలో ఇద్దరు మైనర్లతో పాటు మరొక వ్యక్తి ఉన్నట్లు రాజేం ద్రనగర్ పోలీసులు గుర్తించారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.. గుడి మల్కాపూర్ ప్రాంతానికి చెందిన సురేశ్ సోమవారం ఉదయం రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ పోస్టాఫీసు నుంచి నడుచుకుంటు వెళుతున్నాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఇద్దరు మైనర్ బాలురు, మరొక వ్యక్తి అతన్ని కర్రలతో కొట్టి అతని వద్ద ఉన్న సెల్ ఫోన్ ను లాక్కొని పారిపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాజేంద్రనగర్ పోలీసులు సురేశ్ పై దాడి చేసింది. ఇద్దరు మైనర్ లు అని తేలింది. మరో వ్యక్తి ఎవరనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.





## పోడు రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదు

**భాజపా జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్**

చెన్నూర్, ఏప్రిల్ 21. (ప్రభాత ఉదయం): కోటపల్లి మండలంలోని పోడు రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని బిజెపి జిల్లా అధ్యక్షులు నగునూరీ వెంకటేశ్వర్ గౌడ్ హెచ్చరించారు. ఈరోజు కోటపల్లి మండలంలోని పిన్నారం, ఎస్ఎన్పె, బొప్పారం, ఎడగట్ట, గ్రామాల పోడురైతులతో కలిసి ఎఫ్ డిఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగునూరీ వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. కొందరు అధికారులు అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారి వారి సూచన మేరకు ఎంపిక చేసిన రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇది సరి అయింది. కాదని ఫారెస్ట్ అధికారులు అందరూ పోరు రైతులను ఒకే రకంగా చూడాలని అధికార పార్టీ అండదండలు డబ్బులున్న రైతులను చూసి చూడకుండా వదిలేసి బీద రైతులను మాత్రం హింసలకు గురిచేస్తున్నారని ఎడ్లు నాగలి సైతం గుంజుకొని వెళు తున్నారని ఇది ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. నాలుగు గ్రామాలలో ఇదివరకే ఫారెస్ట్ అధికారులు అడవి ప్రాంతం చుట్టూ ట్రేంజ్ ఏర్పాటు చేశారని దాని ఇవతల ఉన్న రైతులు మాత్రమే వ్యవసాయం చేసుకుంటున్నారని, వారిని కూడా వేధించి చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆయన అన్నారు. మరోసారి పోడు రైతుల్లో అంతరాలు చూపిస్తే సహించేది, లేదని గతంలో పోడు చేసిన ప్రతి రైతును వ్యవసాయం చేసుకోవడానికి అనుమతించాలని ఆయన అన్నారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేషన్ దృష్టికి త్వరలోనే తీసుకొని వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి మండల అధ్యక్షులు మంత్రి రామయ్య, సీనియర్ నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, కౌన్సిలర్ కమల, శ్రీనివాస్, సీనియర్ నాయకులు కొరకొప్పుల వంశీ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజుల పోరాటానికి అంది వచ్చిన ఉపాధి

**ఫలించిన 16ఏళ్ల ముదిరాజుల పోరాటం.. పెద్ద చెరువులో వాటాపై హర్షం**

చెన్నూర్, ఏప్రిల్ 21. (ప్రభాత ఉదయం) : చెన్నూరు పెద్ద చెరువు వాటాకై ముదిరాజులు చేసిన పోరాట ఫలితం ఎట్టకేలకు అందవచ్చింది. సోమవారం రోజున పట్టణంలోని పెద్ద చెరువులో చేపలు పడుతూ పలువురు ముదిరాజ్ కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. గత 16ఏళ్ల క్రితం పెద్ద చెరువుపై కోల్పోయిన తమ హక్కులను తిరిగి సాధించుకోవడానికి ఇంత కాలం పట్టిందని, కుల పెద్దలు తమ హక్కుల కోసం నాయకులు, అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగడమే కాకుండా, ఆందోళనలు, నిరసనలు నిరాహార దీక్షలు చేపట్టి ముదిరాజుల సంక్షేమమే ధ్యేయంగా వారు చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ, వారి పోరాటాలను మరువలేమన్నారు. పెద్ద చెరువులో తాము పొందిన వాటా ఫలితంగా నేడు దాదాపు 5వందల మందికి ఉపాధి అందుతుందని, ప్రభుత్వం మరింత సహకారం అందించాలని, చేపల పెంపకానికి అనుకూలంగా ఉన్న పెద్ద చెరువుకు సంబంధిత అధికారులు పెద్ద ఎత్తున చేపల పంపిణీ చేసి ముదిరాజుల అభివృద్ధికి సహకరించాలని వారు కోరుతున్నారు.





స్పోర్ట్స్ మీట్‌లో గెలుపొందిన వారిని అభినందిస్తున్న ఐ ఐ ఆర్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం



బహుమతులు గెలుచుకున్న శాస్త్రవేత్తలు, అధికారులు



## ఐసీఏఆర్ సౌత్ జోన్ స్పోర్ట్స్ మీట్‌లో ఐఐఆర్ఆర్ ఉద్యోగుల ప్రతిభ

బుద్వేల్, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం): ఏప్రిల్ 8 నుంచి 11 వరకు కోయంబత్తూర్ లో నిర్వహించిన భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) సైత్ జోన్ స్పోర్ట్స్ మీట్ లో రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) శాస్త్రవేత్తలు, ఉద్యోగులు ప్రతిభకనబరిచారు. పోటీలలో గెలుపొందిన వారిని సోమవారం సంస్థ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం అభినందించారు. సౌత్ జోన్ స్పోర్ట్స్ మీట్ లో పాల్గొని సంస్థ పేరును నిలబెట్టారని బహుమతులను గెలచుకున్న వారినుద్దేశించా మాట్లాడారు. పోటీలలో డాక్టర్ టూటీ, డాక్టర్ స్వర్ణలు టెన్నిస్ డబుల్స్ లో విజయం సాదించారన్నారు. క్యారమ్స్ టెక్నికల్ ఆఫీసర్ సదానం దం విజయం సాదించి పతకాన్ని గెలుచుకున్నారన్నారు. ఉద్యోగ జీవితంలో ప్రతి ఒక్కరు క్రీడలలో పాల్గొనడం ద్వారా ఆరోగ్యాన్ని పొందుకుంటారన్నారు. ప్రతి ఒక్కరు కనీసం ఉదయాన్నే వాకింగ్ అన్నా చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మహేందర్ కుమార్, డాక్టర్ ముత్తు రామన్ లు పాల్గొన్నారు.



## పెత్తందారుల ఆగడాలకు బలైన కన్నయ్య కుటుంబానికి న్యాయం చెయ్యాలి

**సీపీఎం పార్టీ చెన్నూరు ఏరియా కార్యదర్శి బోడెంకి చందు**

చెన్నూరు, ఏప్రిల్ 21. (ప్రభాత ఉదయం) :పెత్తందార్ల ఆగడాలకు ఆత్మహత్మకు పాల్పడి అశువులు బాసిన నాయిని కన్నయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని, కన్నయ్యను దూసిస్తూ హింసించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ చెన్నూరు ఏరియా కార్యదర్శి బోడెంకి చందు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం రోజున చెన్నూరు పట్టణ కేంద్రంలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద పార్టీ కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం చందు మాట్లాడుతూ.. పెత్తందారుల దౌర్జన్యాల ఆగడాలను అరికట్టడంలో ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం విఫలం అయిందని, దీనివలన అమాయక ఆదివాసీలు, దళితులు, పేదలు అన్యాయాలకు గురౌతున్నరని, చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో పెత్తందార్ల ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని పేదల జీవితాలతో వారు చలగాటమాడుతున్నారని, దీనిలో భాగంగానే నాయని కన్నయ్యలాంటి అమాయకుడు ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన నాయిని కన్నయ్య ఆత్మహత్యపై ఈ రోజు వరకు స్థానిక బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో నోరు తెరవకపోవడం ఆశ్చర్యంగా ఉన్నదని, పెత్తందారులకు భయపడే వారంతా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారా అంటూ సీపీఎం తరపున ప్రశ్నిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా కన్నయ్య ఆత్మహత్యపై స్పందిస్తూ ఆయన కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఇంట్లో ఒక ఉద్యోగంతో పాటు 50లక్షల రూపాయల పరిహారం అందించాలని, కన్నయ్య పేరున అక్రమంగా పట్టా చేసుకున్న భూమిని తిరిగి పట్టా చేసి కన్నయ్య కుటుంబానికి ఇవ్వాలని చందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్యామల ఉమారాణి, బోండ్ల సరిత నాగజ్యోతి, సిడం సమ్మక్క, తుమ్మ రేణుక, భూధక్క, రాజేశ్వరి, సత్తక్క, ఎల్లమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## పశువులలో ఉచిత గాలికుంటు టీకాలు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం) రాజోలి మండలం తుమ్మలపల్లి , మాన్ దొడ్డి గ్రామాలలో మండల పశు వైద్యధికారి డాక్టర్ మల్లేష్ గారి ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలి కుంటు టీకాలు వేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో 2 గ్రామాలలో 33 మందికి సంబందించిన ఆవులు /ఎద్దులు : 131 మరియు గేదెలు : 170 మొతంగా : 301 పశువులకు టీకాలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యధికారి డాక్టర్ మల్లేష్ గారు పాడి రైతులతో మాట్లాడుతూ పశువులకు గాలికుంటు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు.. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, కార్తీక్, సుజాత, శివ, లక్ష్మన్న, రాఘవేంద్ర మరియు పాడి రైతులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ఉచిత కోచింగ్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం) పేద విద్యార్థులు ఇలాంటి ఉచిత కోచింగ్ సెంటర్లను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదిగి భారతదేశం కోసం సమాజం కోసం పని చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కర్ణాకర్ అన్నారు. గద్వాలలో ఏబివిపీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ మరియు టీజీ ఆర్ జె సి ఉచిత కోచింగ్ సెంటర్ విద్యార్థులకు. పాలిసెట్ మరియు ఆర్ జె సి సెట్ మెటీరియల్ ను సోమవారం పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ 1949 జూలై 9న ప్రారంభమై ఆనాటి నుంచి ఈ నాటి వరకు విద్యార్థుల యొక్క సమస్యల ముందుండి పరిష్కరిస్తున్న సంస్థ కేవలం ఏబీవీపీ మాత్రమే అని గుర్తు చేశారు. ఏబివిపీ దేశవ్యాప్తంగా అనేక సేవా,సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా ఏబివిపీ ఆధ్వర్యంలో గద్వాలలో ఉచిత పాలిటెక్నిక్ మరియు టి జి ఆర్ జె సి ఉచిత బోధన తరగతులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో టిటిసి మరియు ఇఎపి సెట్ నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రముఖ ఆంజనేయులు, జిల్లా వ్యవస్థ ప్రముఖ సురేష్, నగర అధ్యక్షులు కావలి ఆంజనేయులు, నగర ఉపాధ్యక్షులు నరేష్ పటేల్ మాథ్స్ టీచర్ లక్ష్మణ్, పూర్వ నగర అధ్యక్షులు పుష్పత్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు



## జిల్లా పౌరసరఫరాల అధికారిగ వనజాత రెడ్డి

శంషాబాద్, ఏప్రిల్ 21( ప్రభాత ఉదయం) రంగారెడ్డి జిల్లా డిఎస్ఓగా బాధ్యతలు స్వీకరించిన వనజాతా రెడ్డిని రేషన్ డీలర్లు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లా అధ్యక్షులు పి లక్ష్మినారాయణ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షులు టీ శశిధర్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సి. సత్తయ్య .జిల్లా కార్యవర్గం రేషన్ డీలర్లు భానుగౌడ్ విజయ్ సూర్య .కృష్ణ గౌడ్ .సందీప్ గౌడ్. ఏం ఏ సత్తర్ భాస్కర్ రెడ్డి. యాదయ్య. శివకుమార్. వెంకటేష్ జాకారం శ్రీనివాస్ . సురేష్ గుప్త. ఆకుల శ్రీకాంత్. వినయ్ గౌడ్ రాజు యాదవ్ . భాగ్యలక్ష్మి. డీలర్లు వనజాతరెడ్డి ని శాలువతో సన్మానించారు.



## పాపిరెడ్డి నగర్‌లో కొనసాగుతున్న అక్రమ వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ అధికారులకు వినతి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలో గత కొంతకాలంగా అక్రమంగా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ సోమవారం కూకట్ పల్లి మండల తాసిల్దార్ కార్యాలయంలో అదేవిధంగా కూకట్ పల్లి సర్కిల్ కార్యాలయంలోని ప్రజావాణిలో బస్తీ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి అధికారులకు వినతి అందిస్తూ విజ్ఞప్తి చేశారు. పాపిరెడ్డి నగర్ బస్తీలో అక్రమంగా వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి నిత్యం లక్షల లీటర్లను తోడేస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. బస్తీలో నీటి ఎద్దడి తలెత్తడంతో పాపిరెడ్డి నగర్ బస్తీ వాసులందరూ ఏకతాటిపైకి వచ్చి వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ గతంలో నిరసనలు సైతం చేపట్టారు. ప్లాంట్ల నిర్వాహకులకు కనీసం కనువిప్పు సైతం కాకపోవడంతో సోమవారం వివిధ విభాగాల అధికారులకు పెద్ద ఎత్తున బస్తివాసులందరూ తరలి వెళ్లి చంద్రారెడ్డి సమక్షంలో వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ వినతి పత్రాలు అందించి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ బస్తీ వాసులు, సంక్షేమ సంఘం, ఆలయ కమిటీ, సంఘం ఇతర నేతలు, బస్తి మహిళలు అత్యధికంగా పాల్గొన్నారు.


# వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి







గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22 ( ప్రభాత ఉదయం)కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలనిడిమాండ్ చేస్తూ వక్ఫ్ బోర్డు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గద్వాల పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మక్కా మసీదు నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ఈ ర్యాలీ శాంతియుతంగా కొనసాగింది. ముస్లింలు చేపట్టిన ఈ ర్యాలీకి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్‌కేశవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇస్సాక్ వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు పలికారు. వక్ఫ్ బిల్లును వెంటనే విరమించుకోని పక్షంలో బిజెపి ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకతను చవిచూస్తుందని వారు హెచ్చరించారు. వందల సంవత్సరాలుగా నిరాటకంగా కొనసాగుతున్న వక్ఫ్ బోర్డు దాని కార్యకలాపాలను ఇప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏమి వచ్చిందని ఆయా రాజకీయ పార్టీలు, అఖిలపక్షం నాయకులు ప్రశ్నించారు. ఇది పేద ముస్లింల సంక్షేమం కోసమే చేస్తున్నామని బిజెపి, ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంఘాలు దుష్ప్రచారం చేస్తున్నాయి అనీ గత అనేక సంవత్సరాలుగా మతసామరస్యాన్ని దెబ్బ తీసే విధంగా విష ప్రచారానికి పూనుకున్నాయని, ఆయా పార్టీల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని వారు ఉద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీ బిల్లుకు వ్యతిరేకంగా పార్లమెంటులోను, రాజ్యసభలోను పోరాటం చేసిందని, మందబలంతో బిజెపి పార్లమెంటులో బిల్లును సవరణ చేసుకున్నప్పటికీ పార్లమెంటు బయట ప్రజా క్షేత్రంలో ఓడిస్తామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. అదేవిధంగా అఖిలపక్షం కమిటి జిల్లా నాయకులు జిల్లా చైర్మన్ నాగర్ దొడ్డి వెంకట రాములు, అవాజ్ కమిటీ రాష్ట్ర నాయకులు మహమ్మద్ అబ్బాస్, జబ్బార్ మాట్లాడుతూ ఆవాజ్ కమిటీ తరపున ఈ నల్ల చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించడంతోపాటు దానికోసం చివరి వరకు పోరాడుతామని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ నర్సింగ్ రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ర్యాలీలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు కన్వీనర్ అతికూర్ రెహమాన్, సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, ఎంఐఎం జిల్లా అధ్యక్షులు మున్నాబాష, కురువ పల్లయ్య, ఆటోమక్బుల్, రఫీ, పాలమూరు అధ్యయన వేదిక ఎక్బల్ పాషా, మత పెద్దలు మౌలానా మొహమ్మద్ హకీం సహబ్, మౌలానా అబ్బాస్ సహాబ్, మౌలానా ఉస్మాన్ సహబ్, మౌలానా మతులుబ్ హుస్సేన్ సాహబ్, ఎం ఆర్ పి ఎస్ హనుమంతు, రహమతుల్లా, ఆటో చాంద్, టవర్ మక్బూల్, యూనస్, దౌలత్, తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22(ప్రభాత ఉదయం) గద్వాల పట్టణంలో అనంత కన్వెన్షన్ హాల్ నందు కోదండపురం గ్రామానికి చెందిన మాదన్న గారి జ్యోతి వెంకటేశ్వర రెడ్డి కుమారుడు మనోహర్ రెడ్డి శ్రీ వర్షిని రెడ్డి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మార్కెట్ చైర్మన్ మూలమల్ల రాజేశ్వరి భీమిరెడ్డి మాజీ సి డి సి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి ఎం లోకా రెడ్డి ధర్మారం గ్రామానికి చెందిన జగన్మోహన్ రెడ్డి జనంపల్లి మాజీ సర్పంచ్ రామచంద్ర రెడ్డి మాదిగట్ల గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి తిమ్మాపురం రాము తదితరులు పాల్గొని ఆశీర్వదించారు.






## ఏకలవ్య కులానికి సామాజిక న్యాయం కల్పించాలి

### ఏఐసీసీ నాయకులకు బుట్టలు అందజేసి కోరిన సాంబయ్య

వరంగల్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం బ్యూరో):వరంగల్ నగరంలోని హరిత హెూటల్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినఆదివాసి ట్రైనింగ్ క్యాంపు లో ఏఐసిసి సెక్రెటరీ కొప్పుల రాజు , తెలంగాణ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క, ఏఐసీసీ చైర్మన్ విక్రంత్ బీనియా, వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ,పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్ ట్రైనింగ్ కన్వీనర్ రాహుల్ బాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈతబరికతో అల్లిన బుట్టను కాంగ్రెస్ పార్టీ ఎస్టి సెల్ ఎక్స్ కోఆర్డినేటర్ రాయపురం సాంబయ్య వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ ఆర్థిక సామాజిక కంగా ఎరుకల కులానికి తగు న్యాయం చేసినప్పుడే తెలంగాణ రాష్ట్రంలో భారత దేశంలో ఎరుకల ఏకలవ్య కులానికి సామాజిక న్యాయం చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ సమన్యాయం పాటించినట్టు అవుతుంది అని పేర్కొన్నారు. ట్రైనింగ్ క్యాంపులో ఎరుకల కులస్తులు జాతీయ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఎంపీలకు ఎమ్మెల్యేలకు ఎరుకల బుట్టనిచ్చి న్యాయం చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో పిలిచేరి రామకృష్ణ ,కూరాకుల మల్లికార్జున్ ,కావడి మోహన్ రాంబాబు ,శ్రీనివాస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## రాజన్న కాలనీలో మంచి నీరు, కరెంటు సౌకర్యం కల్పించాలి

### సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చెన్నూర్ ఎంపీడీఓ కి వినతి



చెన్నూర్, ఏప్రిల్ 21. (ప్రభాత ఉదయం) :చెన్నూరు మండలం బావురావు పేట గ్రామ పంచాయితీ పరిధిలోని కనికరపు రాజన్న కాలనీ పేదలందరు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంచి నీరు, కరెంట్ సౌకర్యం కల్పించాలని, స్థానిక ఎంపీడీవో కి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా బోడెంకి చందు చెన్నూర్ సిపిఎం పార్టీ ఏరియా కార్యదర్శి మాట్లాడుతూ.. పేదలు రెండు సంవత్సరాలుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ అక్కడే నివసిస్తున్నారు. కనీసం మౌలిక సదుపాయాలు కూడా లేవని పేదలకు మంచినీరు, కరెంటు సౌకర్యం, రోడ్లు నిర్మించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు శ్యామల, ఉమారాణి, సమ్మక్క, నాగజ్యోతి, సరిత, కరీమా, రేణుక, రాజేశ్వరి, బుధక్క, సత్యక్క, ఎల్లక్క, లస్మక్క, మంత్రి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.





వరి పంటను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుంది

### కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి

కొత్తకోట, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం)లిప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట గ్రామంలో అకాల వర్షానికి కురిసి నష్టపోయిన వరి ధాన్యం కల్లాలు, వరి పొలాలను దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి సూచన మేరకు మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి లు నష్టపోయిన పంట పొలాలను వ్యవసాయ అధికారులతో కలిసి పంట పొలాలను, కొనుగోలు కేంద్రాలను సోమవారం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతుకు పంట నష్టపరిహారంతో ప్రభుత్వం ఆదుకుంటుందని చెల్లిస్తుందని వారన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను సర్వే చేయించి నష్టపోయిన రైతుల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం రైతులు ఎవరు కూడా ఆ ధైర్య పడద్దని అన్నదాతలను అన్ని విధాలుగా ప్రభుత్వం నుండి ఆదుకుంటామని పంట నష్టపరిహారం ఇప్పించే విధంగా కృషి చేస్తామని వారన్నారు. తడిసిన ధాన్యాన్ని రైతులు నష్టపోకుండా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్, మండల కాంగ్రెస్ కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకుడు రావుల కరుణాకర్ రెడ్డి, గోకరయ్య నాయుడు, యాదగిరి, కోటీశ్వర్ రెడ్డి, వెంకటయ్య, నాగేశ్వర్ రెడ్డి, పెంటన్న, శ్రీనివాసులు, సాయిల్ గౌడ్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608